



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 పేజీలు 8


## అక్రమ విద్యుత్ సర్వీసులపై

# విచారణకు ఆదేశాలు



- సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదుతో అక్రమ విద్యుత్ మంజూరులో తోట్లవల్లూరు ఏఈపై ఇంధనశాఖ విచారణకు ఆదేశాలు
- తోట్లవల్లూరు ఏఈపై విచారణకు ఆదేశించిన ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్

**కృష్ణాజిల్లా మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం దేవరపల్లి గ్రామంలో అక్రమంగా విద్యుత్ సర్వీసులు మంజూరైన అంశంపై ఇంధనశాఖ జోక్యం చేసుకుంది. దేవరపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ సర్వీసు నం. 6711306000471 మంజూరు చేసినట్లు, అలాగే కేటగిరి-1లో గల సర్వీసు నం. 67113060000275 నుండి డైరీ ఫారంకు అనధికారికంగా విద్యుత్ వినియోగానికి అనుమతించినట్లు ఆరోపణలు వచ్చాయి. మిగతా 2లో




## ప్రతి పర్వదినం మతసామరస్యానికి ప్రతీక

- ఐక్యతా భావంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దాం
- శాంతి, సౌభ్రాతృత్వంతో జిల్లాను ఆదర్శవంతంగా నిలబెడదాం
- పీస్ కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18, మేజర్ న్యూస్ :** పర్వదినాలు మతసామరస్యానికి ప్రతీకలని.. ఐక్యత, సోదరభావంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. గురువారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రతి పండగనూ జరుపుకుంటున్నామని.. ఇదే స్ఫూర్తితో దసరా ఉత్సవాల విజయవంతానికి చేయీచేయీ కలుపుదామని, జిల్లాను ఆదర్శవంతంగా నిలబెడదామని పేర్కొన్నారు. సోదరభావం, ఐక్యత సుస్థిర ప్రగతికి సోపానాలని.. ఈసారి దసరా ఉత్సవాలకు 15 లక్షల మందికి పైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి మిగతా 2లో...

## కూచిపూడి అభివృద్ధికి చర్యలు

కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ 2లో



నగరం మొత్తం

## దీపాలంకారణ

- విద్యుత్ దీపాలంకారణను ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్
- మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న నివాసం విద్యుత్ దీపాలంకారణ
- హైకోర్ట్ ప్రధానిని విమర్శించిన ఘనులు వైసీపీ నాయకులు
- చట్టానికి గౌరవించేది ఎన్డీయే నాయకులు.... చట్టాన్ని మోసం చేసేది వైసీపీ నాయకులు
- వైసీపీ నాయకుల వైఖరిపై మండిపడ్డ ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** వైసీపీ నాయకులు ఎవరన్నా భయం లేదు. చట్టాన్ని పరిరక్షించే న్యాయమూర్తి అన్న లెక్కలేదు. చట్టానికి, సాక్ష్యాలను బట్టి తీర్పు ఆ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తితో పాటు బెంచ్ ను కూడా వైసీపీ నాయకులు అవమానించారు, విమర్శించారని విజయవాడ ఎంపీకేశినేని శివనాథ్ మండిపడ్డారు. విజయవాడ ఉత్సవ్ లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల ప్రకారం నగరం మొత్తం దీపాలంకారణ చేసే కార్యక్రమంలో భాగంగా గురువారం మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న నివాసం విద్యుత్ దీపాలతో అలకరించారు. ఆ విద్యుత్ దీపాలను ఎంపీ కేశినేని శివనాథ్, బుద్దా వెంకన్నతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మీడియా తో మాట్లాడుతూ వైసీపీ నేతలంటేనే డ్రామాలకు కేరాఫ్ అడ్రస్ అనే సంగతి ప్రజలకు తెలుసు అన్నారు. ఎన్నికలకు ముందు బాబాయిని 2

(మొదటిపేజీ తరువాయి)

## అక్రమ విద్యుత్ సర్వీసులపై విచారణకు ఆదేశాలు

ఈ నేపథ్యంలో తోట్లవల్లూరు సెక్షన్ ఎ.పి.సి.పి.డి.సి.ఎల్. అసిస్టెంట్ ఇంజనీరు బొందలపాటి దేవదాస్‌పై జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (విజిలెన్స్), ఎ.పి.ట్రాన్స్కో విచారణ జరపాలని ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు ఉయ్యూరుకు చెందిన సామాజిక కార్యకర్త జంపన శ్రీనివాసగౌడ్ 13-08-2025న చేసిన ఫిర్యాదు ఆధారంగా వెలువడ్డాయి. దేవరపల్లి గ్రామానికి చెందిన షెడ్యూల్డ్ కులానికి చెందిన దళిత మహిళ కె. ఉమామహేశ్వరమ్మ ఇంటికి జగజ్జీవన్ జ్యోతి పథకం ద్వారా మంజూరైన సర్వీసు (జీవో.ఎంఎస్.నెం.28, తేదీ.29-04-2022)ను స్థానిక రెడ్డిబత్తుల శ్రీనివాసరెడ్డి, అనధికారికంగా వినియోగించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై ఎ.పి.టి.ఎస్. విజయవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ విచారణ జరిపినప్పటికీ జరిమానా విధించలేదని తెలుస్తోంది. అలాగే కేటగిరి-1 కింద గల విద్యుత్ సర్వీసును గత 15 ఏళ్లుగా రహదారి అవతల ఉన్న డైరీ ఫారంకు అనధికారికంగా వినియోగించిన ఘటనలో కూడా, 10-04-2025న ఆ సర్వీసు తొలగించినప్పటికీ సంబంధిత అధికారులు జరిమానా విధించలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ అన్ని అంశాలపై తోట్లవల్లూరు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి విచారణకు ఆదేశించినట్లు సమాచారాన్ని యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టి రాష్ట్ర కో కన్వీనర్ జంపాన శ్రీనివాస్ గౌడ్ మీడియాకు వెల్లడించారు.

## కూచిపూడి అభివృద్ధికి చర్యలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కూచిపూడి గ్రామాన్ని ఆధ్యాత్మిక,సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో డిఆర్ఓ కే చంద్రశేఖరరావుతో కలిసి కూచిపూడి గ్రామ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామీణ స్వచ్ఛ అభయాన్ కింద కూచిపూడిలోని ఆయా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయని, ప్రతిపాదించిన పనులకు అంచనాలు తయారు చేసి సమర్పించాలన్నారు. పామర్రు నుంచి కూచిపూడి, అదేవిధంగా కళాక్షేత్రం యూనివర్సిటీకి చేరుకునే ఐలూరు రహదారుల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని డ్రైనేజీ మరమ్మతులను చేపట్టాలని అందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేస్తామన్నారు. రెగ్యులర్ నృత్య కోర్సులతో పాటు సెలవుల్లో రోజుల్లో వారాలు, నెలల షార్ట్ కోర్సులు నిర్వహించే విధంగా చూడాలని, తద్వారా ఎక్కువ మందిని ఆకర్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. గతంలో కూచిపూడి నృత్యం నేర్చుకుని ఉన్నత స్థానంలో ఉన్న ప్రముఖులను గుర్తించి కళాక్షేత్రం అభివృద్ధికి సహకారం కోరాలని ఆయన ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అదేవిధంగా కూచిపూడి గ్రామ మహిళలు తయారు చేసిన కూచిపూడి నృత్య దుస్తులు, జడలు,గజ్జలు తదితర వస్తువులకుమార్కెటింగ్ సౌకర్యం కల్పించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ క్రమంలో ఆయన కళాక్షేత్ర యూనివర్సిటీకి ఉపకులపతిని నియమించాలని ఫోన్ ద్వారా ఉన్నతాధికారులను కోరారు. సమావేశంలో పర్యాటక శాఖ కెపాసిటీ బిల్డింగ్ ఏడి లజవంతి నాయుడు, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి రామ లక్ష్మణరావు, కన్సల్టెంట్ సాహితి, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, మొవ్వ ఎంపీడీవో డి సుహాసిని, తహసీల్దారు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో డా. బోయి భీమన్న జయంతి ఉత్సవాలు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 11.00 గంటలకు మహాకవి పద్మభూషణ్ డా. బోయి భీమన్న జయంతి సందర్భంగా అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి గౌరవ పర్యాటక, సాంస్కృతిక శాఖామాత్యులు కందుల దుర్గేష్, శాసన సభ్యులు, జిల్లా కలెక్టరు డా. జి లక్ష్మీశా, డా. బోయి భీమన్న సతీమణి హైమవతి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో గౌరవ మంత్రివర్యుల చేతుల మీదుగా, డా. బోయి భీమన్న పురస్కారాన్ని ప్రముఖ రచయిత డా. పూర్ణచందుకు ప్రదానం చేస్తారని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసన సభ్యులు, నామినేటెడ్ ఛైర్మన్లు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.

# ప్రతి పర్వదినం మతసామరస్యానికి ప్రతీక



(మొదటిపేజీ తరువాయి)

నగరానికి వచ్చేందుకు అవకాశముందని.. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ భక్తులకు విజయవాడ పర్యటన మధురానుభూతులను మిగిల్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతి కమిటీ స్ఫూర్తికి అనుగుణంగా ముందడుగు వేద్దామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తిచేసే వారిపై పటిష్ట నిఘా ఉంటుందని.. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిభావంతో ప్రతి పండగనూ, ఉత్సవాలను జరుపుకుంటామని.. ఇలాంటి వాతావరణానికి ఇబ్బంది కలిగించాలని ప్రయత్నించే వారిపై డేగ కన్ను ఉంటుందని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, పార్కింగ్ సదుపాయాలు, సీసీటీవీలు, డ్రోన్లతో నిఘా.. ఇలా ప్రతివిషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**విజయవాడ శాంతికి ప్రతీక:** విజయవాడ శాంతియుత వాతావరణానికి ప్రతీక అని.. దసరా ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక భాగస్వాములమవుతామని వివిధ మతాల పెద్దలు పేర్కొన్నారు. తమనుంచి పూర్తి సహాయసహకారాలు ఉంటాయన్నారు. బుడమేరు వరదల సమయంలో ఐక్యతా భావంతో బాధితులకు అండగా నిలిచామని.. ఇలాంటి స్ఫూర్తితోనే మున్ముందుకూడా అడుగులు వేస్తామన్నారు. సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీసీపీ కేజీవీ సరిత, ఎండోమెంట్ ఏసీ ఎన్.షణ్ముగం, డీఎండబ్ల్యూ అబ్దుల్ రబ్బానీ, వివిధ మతాల పెద్దలు తదితరులు హాజరయ్యారు.



## ప్రతి సచివాలయంలో ఆర్ఆర్ఆర్ కేంద్రం ఏర్పాటు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** స్వచ్ఛోత్సవ, స్వచ్ఛత ఈ సేవ 2025 లో భాగం గా, ప్రతి సచివాలయంలో ఆర్ఆర్ఆర్ కేంద్రం ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. గురువారం ఉదయం రాఘవయ్య పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే 64 వార్డుల్లో 64, 9 ప్రత్యేకమైన ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఉన్నాయని, ప్రస్తుతం ప్రతి సచివాలయంలో కూడా ఒక ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ప్రజలు ఆర్ఆర్ఆర్ కేంద్రం వద్దకు వచ్చి, వారికి అవసరం లేని స్టీల్ పాత్రలు, వస్త్రములు, పుస్తకాలు, కాగితాలు, చెప్పులు, షూలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతరత్రా సామాగ్రి ని ఈ ఆర్ఆర్ఆర్ కేంద్రాలలో అందించవచ్చని, వాటి ద్వారా వ్యర్థాలను రెడ్యూస్ అంటే తగ్గించడం, రియూస్ అంటే మళ్ళీ వాడటం, రీసైకిల్ అంటే పునరుద్ధరించే చర్యలు అధికారులు తీసుకుంటారని తెలిపారు. అక్కడ ప్రజలు అందిస్తున్న పుస్తకాలను చూసి వారిని ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు అభినందించారు, తమ తోటి వారికి కూడా ఈ కేంద్రాల గురించి తెలియపరచాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఔటఫాల్ డ్రైన్‌లలో డీసిల్టింగ్ పనులు

## నిరంతరాయంగా జరుగుతుండాలి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఔటఫాల్ డ్రైన్ లలో డీసిల్టింగ్ పనులు నిరంతరాయంగా జరుగుతుండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా వన్ టౌన్ తారాపేట, బి ఆర్ పి రోడ్, నెహ్రూ రోడ్, పాడి వీధి ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఔట్ ఫాల్ డ్రైన్ లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, ఇంజనీరింగ్ అధికారులు ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పని చేస్తూ వ్యర్థాలను తొలగిస్తూ, డీసిల్టింగ్ చేస్తూ ఉండాలని, మెషిన్లను వ్యర్థాలు తొలగించే ప్రక్రియలొ పూర్తిస్థాయిలో ఉపయోగించాలని, అధికారుల ను ఆదేశించారు. తదుపరి వన్ టౌన్ గాంధీ మహిళా కళాశాల వద్ద అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. త్రాగునీటి సరఫరా వాడుకునేటి సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, మరుగుదొడ్లు ఎప్పుడు పరిశుభ్రంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన వసతులను కల్పించాలని విజయవాడ నగర పలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు.

# నగరం మొత్తం దీపాలంకారణ

(మొదటిపేజీ తరువాయి)

చంపి సీఎం చంద్రబాబు పై ఆ కేసు నెట్టాలని శతవిధాలుగా ప్రయత్నించి జగన్ విఫలం చెందాడన్నారు. వైసీపీ నాయకులు వడ్డీ వ్యాపారం చేసి ప్రజలను అధిక వడ్డీలతో పేరుతో హింసించారు, ఇసుక, బూడిద దోచుకున్నారని ఈ విషయాలన్నీ ప్రజలకు తెలుసునన్నారు. వైసీపీ నాయకులు చేసిన మోసాలు, దారుణాలు అన్నీ కోర్టుల్లో నిర్ధారణ కానుండటంతో.. మళ్లీ దొంగే దొంగ దొంగ అన్నట్లుగా ప్రజలను నమ్మించేందుకు అరుస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్తగా ఆలీబాబా 40 దొంగల్లాగా... జగన్ బాబా డజను దొంగలు తయారైయ్యారన్నారు. దొంగల ముఠా మొత్తం ఒక చోట చేరి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దొంగతనాలు చేసేది వారు.. ఎదుటి వాళ్లు దొంగలగా చేసి మాట్లాడతారని మండిపడ్డారు. దసరా ఉత్సవాల సందర్భంగా లక్షలమంది విజయవాడకు వస్తారని, విజయవాడ నగర ప్రాచుర్యం, కళలను పరిచయం చేసేందుకే విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి భక్తులకు అద్యాత్మిక కార్యక్రమాలతో పాటు, వినోద కార్యక్రమాలను అందిస్తామన్నారు. విజయవాడ నగరం మొత్తం విద్యుద్దీపాలతో అలంకరించబోతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్లను, షాపులను విద్యుత్ దీపాలతో అలంకరించుకోవాలని కోరారు. దసరా ప్రతిష్టను, రాబోయే విజయవాడ ఉత్సవ్ ద్వారా దేశవిదేశాల్లో చర్చించుకునేలా నిర్వహిస్తామన్నారు. అనంతరం బుద్దా వెంకన్న మాట్లాడుతూ అమ్మవారి దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని, వచ్చే భక్తులకు ఆహ్లాదం పంచేందుకు విజయవాడ ఉత్సవ్ ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ పాల్గొనే కార్యక్రమాలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎవరు వున్నా లేకున్నా ఈ కార్యక్రమాలు నిరంతరం జరగాలనేది తమ ఆకాంక్ష అని వెల్లడించారు. వైసీపీ నేతలు ఉత్సవాలను కావాలనే వివాదంగా మారుస్తున్నారని మండిపడ్డారు. పేర్ని నాని కోర్టులను కూడా విమర్శలు చేస్తున్నాడన్నారు. కోర్టుల మీద గౌరవం లేకపోతే.. నువ్వు బొక్కేసిన బియ్యం పై నువ్వే మాట్లాడాలని డిమాండ్ చేశారు. బియ్యం దోపిడీ కేసులో కోర్ట్ స్టే ఇస్తే సంబరాలు ఎందుకు చేసుకున్నారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. స్టే వెకేట్ అయితే మాత్రం కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారన్నారు. కేశినేని చిన్నీ గురించి మాట్లాడే అర్హత నీకు ఉందా పేర్ని నానీ ని ప్రశ్నించారు. కేశినేని నానీ మీ వెనుక ఉన్నాడని ఇప్పుడు మీరే రుజువు చేశారన్నారు. ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు చిన్నీ సారధ్యంలో విజయవాడ ఉత్సవ్ జరుగుతుందన్నారు. కోర్టులు కూడా తమకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయన్నారు. మంచి పనులు చేసే వాళ్లపై బురద జల్లడం వైసీపీ నేతలకు అలవాటే అన్నారు. 2.50లక్షల ఓట్లతో ఓడిపోయిన కేశినేని నానికి పేమెంట్ ఇచ్చి.. నానీతో మాట్లాడిస్తున్నారన్నారు. మీరు ఎన్ని వాగినా.. ఆగేది లేదు.. ఉత్సవాలు జరిపి తీరుతాం ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.. తప్పకుండా వారికి మరోసారి బుద్ధి చెబుతారు .మీరు చేసేవే దొంగ పనులు... సత్య హరిశ్చంద్రుల్లాగా నీతులు మాట్లాడతారా అంటూ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ మరుపిళ్ల తిరుమలేష్ తో పాటు ఎన్డీయే కూటమి నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 23 నుండి ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ సందర్భంగా మోటరోలా స్మార్ట్‌ఫోన్‌ల ఆఫర్లు




**విజయవాడ మేజర్ న్యూస్ :** మొబైల్ టెక్నాలజీలో ప్రపంచ అగ్రగామి, భారతదేశంలోని ప్రముఖ ఏఐ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన మోటరోలా, ఈరోజు ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ 2025 కోసం ఇంతకు ముందు ఎన్నడూ లేని ధరలకు ప్రీమియం, మిడ్-రేంజ్ స్మార్ట్‌ఫోన్ల అతిపెద్ద పండుగ శ్రేణిని ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యంత లీనమయ్యే ఏఐ-ఆధారిత మోటరోలా ఎడ్జ్ 60 ప్రో, మోటరోలా ఎడ్జ్60 ఫ్యూజన్ మొదలుకొని బెస్ట్ సెల్లింగ్ మోటో జి సిరీస్ స్మార్ట్ ఫోన్లు, ఐకానిక్ మోటరోలా రేజర్ 60 సిరీస్ వరకు, మోటరోలా ఈ సీజన్‌లో పండుగ షాపింగ్‌ను పునర్నిర్వచించనుంది. ఈ సేల్ సెప్టెంబర్ 23, 00:00 గంటలకు ఎర్లీ యాక్సెస్ కస్టమర్లకు, ప్రత్యేకంగా ఫ్లిప్‌కార్ట్‌లో సెప్టెంబర్ 22 నుండి అందరు వినియోగదారులకు లైవ్ లోకి వస్తుంది. అన్ని ఉప కరణాలు సేల్ వ్యవధి అంతటా ఆకర్షణీయమైన బిగ్ బిలియన్ డేస్ ధరలకు అందుబా టులో ఉంటాయి. మోటరోలా ఎడ్జ్60 ప్రో – ఈ బిగ్ బిలియన్ డేస్‌లో అల్టి మేట్ ప్రీమియం ఏఐ స్మార్ట్‌ఫోన్ డీల్‌తో ప్రారంభించి, మోటరోలా ఎడ్జ్60 ప్రో 8+256జిబి వేరియంట్, అసలు ధర రూ.29,999, ఇప్పుడు కేవలం రూ.24,999 నికర వర్తించే ధరకు అందుబాటులో ఉంది. మోటరోలా ఎడ్జ్60 ఫ్యూజన్ అనేది 20కె లోపు ఉన్న అత్యుత్తమ బిగ్ బిలియన్ డేస్ ఆల్-రౌండర్ స్మార్ట్‌ఫోన్. పండుగ ప్రత్యేక ధర 8+256జిబికి రూ.19,999, 12+256జిబికి రూ.21,999తో ఇది అధునా తనత, ఎండ్యూరన్స్, తదుపరి తరం ఏఐ పనితీరు పరిపూర్ణ కలయికగా నిలిచింది. మోటో జి96 5జి – రూ.15కె లోపు అత్యుత్తమ అన్‌డిస్ప్యుటెడ్ ఆల్-రౌండర్ స్మార్ట్‌ఫోన్ అయిన మోటో జి96 5జి, 144హెచ్ జెడ్ 6.67" పోల్డ్ కర్వ్ డిస్‌ప్లేతో తన సెగ్మెంట్ ఏకైక ఫోన్‌గా జి-సిరీస్‌కు సెగ్మెంట్-ఫస్ట్ ఫీచర్‌లను తీసుకువస్తుంది.

8+128జిబికి రూ.14,999, 8+256జిబికి రూ.16,999 ధరలకు పండుగ ప్రత్యేక పరిమిత కాలంలో అందుబాటులో ఉన్న మోటో జి96 5జి బిగ్ బిలియన్ డేస్ సేల్ కోసం పనితీరు, మన్నిక, డిజైన్‌ను సంపూర్ణంగా సమతుల్యం చేస్తుంది. మోటో జి86 పవర్ – మధ్య-శ్రేణి పవర్, ఎండ్యూరన్స్‌ను పునర్నిర్వచిస్తూ, మోటో జి86 5జి పవర్ డిస్ప్లే ప్రకాశం, బ్యాటరీ దీర్ఘకాల మన్నికను కోరుకునే వారి కోసం నిర్మించబడింది. రూ.15,999 పండుగ ప్రత్యేక ధరకు అందుబాటులో ఉన్న మోటో జి86 పవర్ అనేది రూ.15కె దరిదాపులో ఉత్తమ డిస్‌ప్లే, బ్యాటరీ స్మార్ట్‌ఫోన్. మోటరోలా రేజర్ 60 – మోటరోలా రేజర్ 60 – భారతదేశంలోని అత్యంత చక్కని, స్టైలిష్ ఫ్లిప్ అయిన మోటరోలా రేజర్ 60, ఆవిష్కరణ, శైలి, మన్నికను కోరుకునే సృష్టికర్తల కోసం రూపొందించబడింది. 8+256జిబి వేరియంట్ యొక్క పండుగ బిగ్ బిలియన్ డేస్ ధర రూ.39,999.

# మునిసిపల్ కార్మికులకు పిఆర్సిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** చాలీ చాలని జీతాలు, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో మున్సిపల్ కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు.గురువారం మచిలీపట్నం నగర పాలకు సంస్థ కార్యాలయం ముందు జరిగిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పెరుగుతున్న నిత్యవసర ధరల కనుగుణంగా, 12వ పిఆర్సి ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రతినెల మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సబ్బులు, చెప్పులు,కొబ్బరి నూనె తదితర రక్షణ పరికరాలను వెంటనే కార్మికులను అందజేయాలన్నారు.పర్మినెంట్ కార్మికుల సరెండర్ లీవుల బిల్లులను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అనేకమైనటువంటి కార్మికుల డిమాండ్ల సాధన కొరకు ఏపీ.మునిసిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) మచిలీపట్నం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో యూనియన్ మచిలీపట్నం అధ్యక్షురాలు చోక్కాకుల బుల్లెమ్మ,సిఐటియు కన్వీనర్ చిరువోలు జయరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మచిలీపట్నం కార్యదర్శి శిరంశెట్టి దుర్గాప్రసన్నుడు, ఏ.స్వప్న, ఎస్ దుర్గభవాని, సంఘం రెడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జయప్రద పౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 18 మేజర్ న్యూస్:** ఆరోగ్యమే మహాభాగ్యం ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి సమాజమంతా ఆనందంగా ఉండాలి అందులో చదువుకునే ప్రతి విద్యార్థిని,విద్యార్థులు ఆరోగ్యం పట్ల అవగాహనతో ఉండి, మంచి ఆరోగ్యంగా ఉండాలనే విశాయాల హృదయంతో, ఉన్నత ఆశయంతో, విలువలతో కూడిన వైద్య సేవలు అందిస్తున్న జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట పట్టణంలో గల వాగ్దేవి కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థిని,విద్యార్థులకు గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో మొత్తం 650 మంది విద్యార్థులు వైద్య సేవలు పొందడం జరిగింది.కంటి వైద్య సేవలు పొందిన విద్యార్థిని, విద్యార్థులుల 326 మంది. వారిలో 125 మందికి దృష్టిలోపములు ఉండి కళ్ళజోడులు అవసరమని డాక్టర్లు గుర్తించారు. వారికి త్వరలో జయప్రద ఫౌండేషన్ ద్వారా కళ్ళజోడులు అందజేయబడునని వారు తెలియజేశారు., కంటి చూపు లోపం ఉండి ఆపరేషన్ అవసరమైన 4గురు బాలికలను గుర్తించటమైనది. వారికి వారి తల్లిదండ్రుల కోరిక మేరకు త్వరలో శంకర్ నేత్రాచికిత్సాలయం విజయవాడ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించబడునని తెలియజేసారు. జనరల్ వైద్య సేవలు పొందినవారు325 మంది బాలికలకు హెచ్ బి రక్త పరీక్షలు నిర్వహించి వారిలో రక్తహీనత, ఐరన్ లోపములు ఉన్న విద్యార్థిని, విద్యార్థులకు డాక్టర్లు సూచన మేరకు ఉచితంగా మందులు అందజేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం, పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ శంకర్, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపల్ సురేష్,, శిబిర కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు, ఫౌండేషన్ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని మొదటి రోజు సేవలు అందించి ఉన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు వాగ్దేవి కాలేజీలో గల మిగిలిన నర్సింగ్ విద్యార్థులకు, డిగ్రీ విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించబడునని తెలియజేయడం జరిగింది.





## కోళ్లకు కొక్కెర తెగులు వ్యాధి నివారణ టీకాలు

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కోళ్లకు కొక్కెరతెగులు వ్యాధి నివారణ టీకాలను అందజేసినట్లు యలమర్రు ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి.వి.నరసింహారావు తెలిపారు. స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ ఎన్.వనిత, వానపాముల, పెదపారుపూడి, ఈదులమద్దాలి, వెంట్రప్రగడ గ్రామాలకు చెందిన పశువైద్య సిబ్బంది ఎస్.వి.సూర్యకుమారి, ఎ.శ్రీనివాసరావు, కె. ఆదినారాయణ సిహెచ్.అంజనాదేవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని 450 కోళ్లకు వ్యాధి నివారణటీకాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. అలాగే యలమర్రు గ్రామంలో కూడా కోళ్లకు కొక్కెర తెగులు వ్యాధి నివారణ టీకాలను అందజేసినట్లు డాక్టర్ నరసింహా రావు చెప్పారు. తమ ఏరియా పశు వైద్యశాల పరిధిలోని ప్రతి గ్రామంలో నూతమ సిబ్బంది ఇంటింటికి తిరిగి కోళ్లకు ఈటీకాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున కోళ్ల పెంపకం దారులు తమ సిబ్బందికి సహక రించి తప్పనిసరిగా కోళ్లకు ఈటీకాలు వేయించవలసిందిగా ఆయన కోరారు.

## రూ.9899 ప్రారంభ ధరతో సామ్సంగ్ గెలాక్సీ ఏ06 5జి

**విజయవాడ మేజర్ న్యూస్ :** పండుగ సీజన్‌కు ముందు గెలాక్సీ ఏ06 5జి స్మార్ట్‌ఫోన్‌పై మునుపెన్నడూ చూడని ధరను ఏ06 5జి ప్రకటించింది. ఈ పరిమితకాల ఆఫర్‌లో భాగంగా గెలాక్సీ ఏ06 5జి కేవలం రూ. 9899కే అందుబాటులో ఉంటుంది. ఫీచర్ ఫోన్ లేదా 4జీ స్మార్ట్‌ఫోన్ నుండి గెలాక్సీ ఏ06 5జికి అప్‌గ్రేడ్ కావాలనుకునే వినియోగదారులకు ఈ డీల్ సరైన అవకాశాన్ని అందిస్తుంది. ఇది సరసమైన ధరలో పూర్తి 5జీ అనుభవాన్ని అందిస్తుంది. అదనంగా, పండుగ డీల్‌లో భాగంగా, గెలాక్సీ ఏ06 5జి కొనుగోలు చేసే వినియోగదారులు రూ. 1399 విలువైన సామ్సంగ్ 25 వాట్స్ ట్రావెల్ అడాప్టర్‌ను కేవలం రూ. 299కే పొందుతారు. మరింత సరసమైన ధరను కోరుకునే వినియోగదారులు నెలకు కేవలం రూ. 909 చెల్లించి స్మార్ట్‌ఫోన్‌ను సొంతం చేసుకోవచ్చు

## రామిశెట్టి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన రామిశెట్టి జగన్మోహన్ రావు ఇటీవల మరణించగా పామూరు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుమార్ రాజాతో పాటు బలిపర్రు గ్రామ సర్పంచ్ సుధాకర్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివి సీమ గాంధీ మండలి శత జయంతి వేడుకలు



**నాగాయలంక సెప్టెంబర్ 18 మేజర్ న్యూస్ :** దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 46వ రోజున జరిగిన, కార్య క్రమంలో బాగంగా గురువారం అవనిగడ్డ బిజెపి మండల పార్టీ ప్రెసిడెంట్ ఏడుకొండలు స్వర్గీయ మండల వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాలవేసి, శ్రద్ధాంజలి ఘటించినారు. ఈ కార్యక్రమానికి నాగాయలంక బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శివాజీ బిజెపి సీనియర్ నాయకులు చిన్న గిరి లతా మోహన్ కూటమి నాయకులు,థిస్ ఇస్ చైర్మన్ బండ్రెడ్డి వెంకట నాగ మల్లికార్జునరావు దివి మార్కెటింగ్ యాడ్ డైరెక్టర్స్ ఉప్పల ప్రసాద్ తాడేపల్లి పాపారావు,టీ.కొత్తపాలెం మాజీ ప్రెసిడెంట్, మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి మల్లికార్జున్, బండ్రెడ్డి.హరి, ముమ్మా రెడ్డి.సురేష్,బండ్రెడ్డి బోసు, రే మాల.బాబురావు. మాదివాడ అర్జునరావు, తలశిల.రామకృష్ణ (చౌదరిమాస్టర్) తలశిల.రాఘవరావు, తలశిల శివశంకర్,భర్రెంకుల పి ఎ సిఎస్ చైర్మన్, శ్రీనివాసరావు,వీర, మహిళలు, కూటమి నాయకులు, మండలి వెంకట కృష్ణా రావు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

# దసరా, విజయవాడ ఉత్సావ్‌ల నేపథ్యంలో వెస్ట్ బైపాస్‌ను పరిశీలించిన సీపీ, కలెక్టర్







**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను, విజయవాడ ఉత్సావ్ పురస్కరించుకొని ప్రయాణికులకు, వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రశాంతమైన వాతావరణంలో వారి ప్రయాణాలను సాగించాలనే ఉద్దేశంతో గురువారం పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, జిల్లా కలెక్టర్ లక్ష్మి శా, ఏ.పి.ట్రాన్స్కో అధికారులు, వెస్ట్ బైపాస్ ప్రాజెక్టు డైరెక్టర్లు, ఇతర అధికారులతో కలిసి వెస్ట్ బైపాస్ ఏరియాను పూర్తిగా పరిశీలించి వాహనదారుల ప్రయాణాలపై సాధ్యా సాధ్యలపై చర్చించి అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సారి దసరా ఉత్సవాలకు 15లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉన్నట్లు, సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ పాటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేయడం జరుగుతుంది.

అదేవిధంగా ఎన్నడూ లేని విధంగా విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు, ఈ నేప ధ్యంలో వివిధ ప్రాంతాల నుండి నగరానికి వచ్చిన ప్రయాణికులకు, నగరం మీదుగా ప్రయాణించే ప్రయాణికులు ఎక్కడా ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రయాణం సాగించడానికి, ట్రాఫిక్ సౌలా భ్యం కోసం వెస్ట్ బైపాస్‌ను ఉపయోగించాలని సంబంధిత శాఖల వారితో సమన్వయం చేసుకుని వాహనదారుల ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లను చెయాలని అధికారులకు ఆదేశాలను అందించారు.

ఈ నేపథ్యంలో మరోసారి పార్కింగ్ ఏరియాలను, కుమ్మరిపాలెం నుండి దుర్గాఘాట్ వరకు క్యూలైన్లను, దుర్గా ఘాట్ నుండి మహామండపం, కనకదుర్గా నగర్, రథం సెంటర్, వినాయక టెంపుల్, సీతమ్మ వారి పాదలు, హోల్డింగ్ ఏరియాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, డి.సి.పి. తిరుమలేశ్వర రెడ్డి, ఏ.డి.సి.పి. జి. రామ కృష్ణ, ఏ.పి.ట్రాన్స్కో అధికారులు, ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ఇతర ఆర్&బి అధికారులు, ఏ.సి.పి.లు ఇన్స్పెక్టర్లు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దసరా వేడుకలకు శరవేగంగా పారిశుధ్యం







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం ఆదేశాలు మేరకు దసరా శరన్నవరాత్రులు వేడుకలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా జరగాలని, పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించగా, గురువారం సాయంత్రం కృష్ణవేణి ఘాట్ వద్ద పారిశుధ్యం పనులను చేపట్టారు పారిశుధ్య సిబ్బంది.

## ఎలుకల వల్ల నష్టపోకుండా చిరు పొట్ట దశలో ఉన్న వరిని కాపాడుకోండి



**పెడన, మేజర్ న్యూస్ :** చిరు పొట్ట దశలో ఉన్న వరిని ఎలుకల వల్ల నష్టపోకుండా ప్రతి రైతు కాపాడుకోవాలని దానికి ప్రభుత్వం ఇస్తున్న నూరు శాతం రాయితీతో బ్రోమోడైలాన్ మందును ప్రతి రైతు వినియోగించాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ మనోహర్రావు తెలిపారు. ఈ మేరకు గురువారం నందమూరు గ్రామంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం రైతులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఆర్సిటీం జ్యోతి రమణి, వ్యవసాయ సహాయ సంచాలకులు డిఆర్సి శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి డి ఆర్ సి పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఎలుకలు ఎక్కువగా నష్టం చిరు పొట్ట దశలో కలుగజేస్తాయని, ఈ దశలో ఎలుకల ముందు రైతులు తప్పనిసరిగా సామూహికంగా పెట్టుకోవాలని వివరించారు. అనంతరం జ్యోతి రమణి మాట్లాడుతూ నూకలు 96 పాళ్ళు నూనె రెండు పాళ్లు, బ్రోమో డైలాన్ మందు రెండు పాళ్లు కలుపుకొని పొట్లాలు కింద ఏలుకుల బొరియలు దగ్గర పెట్టుకోవాలని తెలిపారు. ఈ మందుని గ్లౌసెస్ వేసుకుని కలుపుకోవాలని చెప్పారు. ఈ మందు తిన్నాక ఎలుక రెండు మూడు రోజుల్లో తప్పనిసరిగా చనిపోతుందని స్పష్టం చేశారు. ఈ మందు వాడకం ద్వారా ఎక్కువ శాతం ఎలుకలను నిర్మూలించుకోగలమని వ్యవసాయ సహాయ సంచాలకులు డిఆర్సి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ బ్రోమోడైలాన్ మందు 100% రాయితీతో ప్రతి రైతు సేవా కేంద్రాలలో రైతులకు ఇస్తామని మండల వ్యవసాయ అధికారి ఎస్ జెన్నీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

# తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ వీఆర్ఏల నిరసన



**పామర్రు మేజర్ న్యూస్:** గ్రామ రెవెన్యూ సహాయకులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పామర్రు తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, ఇంటర్మీడియట్ పూర్తయిన వీఆర్ఏలకు వీఆర్వోలు, జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని, కార్యాలయంలో నైట్ వాచ్ మెన్, అటెండర్ పనులను తమకు కేటాయించరాదని, నామినీలుగా పనిచేస్తున్న వారందరిని వీఆర్ఏలుగా గుర్తించాలని, తమకు అందిస్తున్న డి ఏ ను వేతనం నుండి మినహాయించడాన్ని నిలుపుదల చేయాలని, రికవరీ చేసిన డిఎను తిరిగి తమకు చెల్లించాలని, 65 సంవత్సరాల పైబడి వయసు కలిగి మరణించిన వీఆర్ఏల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు స్థానం కల్పించాలని, వీఆర్వోల నియామకంలో వీఆర్ఏలకు ఉన్న 30శాతంను 70 శాతం పెంచాలని తదితర డిమాండ్లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వీఆర్ఏల సంఘం పామర్రు మండల అధ్యక్షులు జె.బాబుజి, సంఘ సభ్యులు దాసరి ప్రసాద్, చాట్ల రమేష్, ప్రభాకర్, గోపి, పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

# ఉద్యానవన, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అగినపర్రు రైతు సేవా కేంద్రంలో గురువారం ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యానవన శాఖ డి డి హెచ్ జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యాన వన పంటల సాగునకు రాయితీ ఇస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కూరగాయల సాగు పై గరిష్టంగా ఒక రైతుకు ఒక హెక్టారు నకు 24వేల రూపాయలు, పూల సాగునకు ఒక హెక్టారుకు 20వేల రూపాయలు, పాత తోటల పునరుద్ధరణకు ఖర్చు లో 40శాతం, గరిష్టం గా హెక్టారుకు మామిడి కి 24వేల రూపాయలు చొప్పున ఒక్కొక్క రైతుకు 2 హెక్టార్లు వరకు రాయితీ ఇవ్వబడుతుందన్నారు. ఆయిల్ పామ్ పథకం లో మొక్కల కొనుగోలు పై 100శాతం రాయితీ, ఒక హెక్టారుకు 143 మొక్కలు, దేశవాళి మొక్కలకు 20 వేల రూపాయలు, ఇతర దేశాలనుండి దిగుమతి చేసుకునే వాటికి 29 వేల రూపాయలు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ వేసే రైతులకు మొదటి 4 సంవత్సరములు ప్రధాన, అంతర్ పంటల నిర్వహణకు 21 వేల రూపాయల చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. గన్నవరం వ్యవసాయ సహాయ సంచాలకులు సునీల్ మాట్లాడుతూ సామూహిక ఎలుకల నివారణకు ప్రభుత్వం 100శాతం రాయితీ పై ఎలుకల మందును అందిస్తోందని తెలిపారు. ఎలుకల మందునకు నూకలు, నూనె కలిపి ఎరను తయారు చేసుకొని రైతులంతా కలిసి ఒకేసారి సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలని సూచించారు. ఇ- పంట నమోదు ఈ నెల 30వ తేదీ తో ముగుస్తుందని, కావున రైతులు అందరు తప్పక నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, గ్రామ సర్పంచ్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో..

# శరవేగంగా జరుగుతున్న మార్కెటింగ్ యాడ్, జంగిల్ క్లియరెన్స్





**నాగాయలంక సెప్టెంబర్ 18 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని దీవి సీమ ప్రాంతంలో పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా, ఎదురుమెండి - జింక పాలెం, రహదారి శంకుస్థాపనకు సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టర్, డీకే బాలాజీ, సభా వేదిక పరిశీలన కోసం రాగా ఆయన వెంట ఆర్డీవో స్వాతి, నాగాయలంక మండల రెవెన్యూ అధికారి, సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్, స్థల పరిశీలన కోసం నాగాయలంక మండలంలోని రెండు మూడు ప్రదేశాలు పరిశీలన చేశారు. పరిశీలించిన ప్రదేశాలలో ఏటి మోగ గ్రామంలోని మార్కె టింగ్ యాడ్ ప్రదేశం అస్తవ్యస్తంగా చెట్లతో పొదలతో నిండి ఉండుట చేత అచ్చట నుండి సంబంధిత, మార్కెటింగ్, అధికారులతో మాట్లాడి ముందస్తు చర్యలలో భాగంగా, మార్కెటింగ్ యార్డ్ అధికారులను సంబంధిత శాఖ అధికారులను పిలిపించి వారికి తెలియజేసి వెంటనే ఆ ప్రదేశంను బాగు చేయమని తెలియజేశారు. వెంటనే ఈరోజున గ్రామంలోని,10 ఎకరాలు, విస్తీర్ణంలోని మార్కెట్ యార్ట్ ఆవరణలో గలచెట్లను ముళ్ళ పొదలను రోడ్ల పైన ఉన్న మట్టిని తొలగించుటకు నూతన మార్కెటింగ్ యాడ్ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు డైరెక్టర్ ఉప్పల ప్రసాద్ తాడేపల్లి పాపారావు మార్కెటింగ్ యాడ్ అధికారులతో కలిసి జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించి వేగంగా జరిపించు చున్నారు త్వరలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యటన నేపథ్యంలో గత ప్రభుత్వంలో పాడు పడి నటు వంటి మార్కెటింగ్ యాడ్ ఆవరణకు నూతన సొగసులు, వచ్చుచున్నందున దీవి సిమ ప్రాంత, రైతులు, ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కృష్ణాజిల్లా బీ.సీ సంక్షేమ సంఘం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నంలో వివిధ సమస్యలపై నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజుకు కృష్ణ జిల్లా బీ.సీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం సుబ్రమణ్యం మాట్లాడుతూ నాణ్యతలేని పసుపు రంగు ఎల్.ఈ.డి వీధి దీపాలు అమర్చడంతో మచిలీపట్నం వీధులు కాంతి విహీనంగా మారాయి అన్నారు. మురుగు కాలువలపై సప్టాలు లేకపోవడం ఆపైన షిల్ట్ తీయకపోవడం దానిలో నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించడం నగరవాసులకు శాపంగా మారింది అన్నారు. గృహాలకు నూతనంగా మంచినీటి కుళాయిలు వేయించుకునే వారికి అందుకు సంబంధించిన గుంతలు తవ్వించుకునేందుకు ఫిట్టర్లకు సంబంధించిన మనుషులు ఇష్టానుసారం దండుకోవడం జరుగుతొందన్నారు. దీనిని నివారించేందుకు మున్సిపాలిటీ వారే చలానా కట్టించుకుని, గుంతలు తవ్వించే సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రోడ్ల పక్కన గృహాలు ఉన్నవారు వారి ఇళ్లల్లో జరిగే కార్యక్రమాలకు ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా రోడ్లను మూసివేయడం జరుగుతొందన్నారు. కాబట్టి వీరి వద్ద నుంచి కూడా చలానాలు వసూలు చేసి ముందుగానే మాధ్యమాల ద్వారా ఏ రోడ్డు మూసివేయడం జరుగుతుందో ప్రజలకు తెలియజేసి ఇబ్బందిని తొలగించాలని సుబ్రమణ్యం ఈ సందర్భంగా కోరారు. పైన పేర్కొన్న అంశాల పై తగు చర్యలు తక్షణమే తీసుకోవాలని కమిషనర్ బాపిరాజుకు బీ.సీ సంక్షేమ సంఘం తరఫున వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జన్ను గోవిందు, బోగిరెడ్డి సుభాని, అన్సారి, పి. సాంబశివరావు, ఎం. రామ రాజు, పవన్, తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.



## ఊపకాయంపై తల్లులకు అవగాహన

**ఘంటసాల మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంటసాల అంగన్వాడి - 1 సెంటర్‌లో పోషకాహార మాసఉత్సవాల భాగంగా ఊబకాయం పై తల్లులకు సెక్టార్ సూపర్వైజర్ రమా నాగమణి గురువారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు చక్కెర, నూనె, వాడకం తగ్గించాలని, ఫాస్ట్ ఫుడ్స్ కు దూరంగా ఉంచాలని, శీతల పానీయాలు తీసుకోరాదని, పిల్లలకు మంచి పోషకాహార ఆహారాన్ని అందించాలని తల్లులకు సెక్టార్ సూపర్వైజర్ రమా నాగమణి తల్లులకు తెలియజేశారు. అంగన్వాడి కార్యకర్తలు తల్లులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతాహి సేవపై ప్రజల్లో అవగాహన కల్పించండి...

### కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్:** పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియచెప్పేలా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్, డ్వామా, రహదారులు భవనాలు శాఖల అధికారులతో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం అమలుపై చర్చించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమములో భాగంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ రెండవ తేదీ వరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంపై ప్రజలందరికీ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భారతదేశాన్ని పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో ప్రారంభించబడిన స్వచ్ఛభారత్ మిషన్ అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు పరిసరాల పరిశుభ్రతలో ప్రజలందరిని భాగస్వామ్యం చేయాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చడం ఈ మిషన్ లక్ష్యాల్లో ఒకటి అని, దీని కోసం జిల్లాలో 10 వేల జనాభా కలిగిన 16 గ్రామ పంచాయతీలను గుర్తించడం జరిగిందని, ఆ గ్రామాలలో ఆకాంక్ష మరుగుదొడ్ల ఆస్పిరేషన్ టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని, అందుకు గ్రామానికి దూరంగా కాకుండా దగ్గరలోని అనువైన స్థలాలను గుర్తించాలని జిల్లా పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ ఆర్డబ్ల్యూఎస్ అధికారి సోమశేఖర్ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఎస్ఈ పీవీ రమణరావు, డ్వామా పీడీ ఎన్వీ శివ ప్రసాద్ యాదవ్, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వి. విద్యాసాగర్ నాయుడు ఆంధ్ర రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రని గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## పాఠశాల విద్యార్థినులకు చట్టాలపై అవగాహన



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పామర్రులోని కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పలు చట్టాలపై సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.శుభాకర్ అవగాహన కల్పించారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సైబర్ మోసాలు జరుగుతున్న విధానం, వాటి బారిన పడకుండా తీసుకోవలసిన చర్యలు గూర్చి వివరించారు. అలాగే ఎన్డిపిఎస్ చట్టం ఏ విధంగా పనిచేస్తుందనే విషయాలపై అవగాహన కల్పించారు. వీటితోపాటు ట్రాఫిక్ నియమాలను పాటించడం, సోషల్ మీడియాలో ఏ విధంగా ఉండాలనే విషయాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఫోక్సో చట్టం ఏ విధంగా పనిచేస్తుందనే అంశంపై వారికి వివరించారు. ఇక ఈ కార్యక్రమంలో పామర్రు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ కూడా పాల్గొన్నారు.

## కృష్ణాపురంలో పోషకాహార మహోత్సవం నిర్వహణ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పోషకాహార మాసోత్సవాలలో భాగంగా పమి డిముక్కల మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో అంగన్ వాడి కేంద్రంలో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ సూపర్ వైజర్ సలీమున్నీసా గర్భిణీ స్త్రీలకు, బాలింత మహిళలకు పలు సూచనలను అందించారు. తక్కువ ఖర్చుతో కూడుకున్న ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని, అలాగే స్థూలకాయ నివారణ గురించి వివరించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించే విషయంలో తల్లులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో అంగన్వాడీ కార్యకర్త పి పరమేశ్వరి, పలువురు తల్లులు పాల్గొన్నారు.

## వరి సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన




**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల ప్రాంగణంలో ఇఫ్కో కంపెనీ వారి సహకారంతో ఖరీఫ్ పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన చర్చా గోష్ఠి నిర్వహించారు. కేవికే సమన్వయ కర్త డా. సుధా రాణి మాట్లాడుతూ పంటల సాగులో అధిక మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నారని, సాగు ఖర్చు అధికంగా మారి నికర ఆదాయం తగ్గుతుందన్నారు. రసాయనేతర పద్ధతులు అవలంభించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలని తెలియచేశారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులను, ఎలుకల యాజమాన్యం, చేపట్టాల్సిన మెళకువలను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. వరి పంటలో ఆకు నల్లి ఉనికి ఉన్నప్పటికీ నష్టం కలుగచేసేలా ఉధృతి స్థాయిలో లేదు అని, వాటి యాజమాన్యంలో భాగంగా విచక్షణా రహితంగా మందులను పిచికారీ చేస్తే సుడి దోమ ఉధృతి పెరిగే ఆస్కారం ఉంటుందన్నారు. ఇఫ్కో తరపున రైతులకు నానో యూరియా, నానో డిఏపీ పైన వాటి పని తీరు, వినియోగించే విధానం, డ్రోన్ పిచికారీ మొదలగు అంశాల పైన రైతులకు ఇఫ్కో అవగాహన కల్పించారు. కేవికే శాస్త్రవేత్తలు రేవతి, మంజు వాణి, వెంకటలక్ష్మి, యశ్వంత్, నవీన్, మేనేజర్ నంద కిషోర్, కేవికే సిబ్బంది, ఘంటసాల మండల వ్యవసాయాధికారిణి అనూష రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా ఎంపీ బాలశౌరి జన్మదిన వేడుకలు

**పెడన, మేజర్ న్యూస్ :** పట్టణ జనసేన ఆధ్వర్యంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి 58వ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు వాళ్లకి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూ ప్రజా మన్ననలు పొందుతున్న బాలశౌరి మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. బందరు పోర్టు తో పాటు జాతీయ రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద కృషి చేస్తూ కృష్ణాజిల్లా పరిసర ప్రాంతాల పారిశ్రామీకరణ దిశగా పయనిస్తున్న బాలశౌరి కి భగవంతుడు ఆయురారోగ్యాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన కౌన్సిలర్ మట్టా శివ పావని,పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య,చందన నారాయణరావు కమ్మగంటి వెంకటేశ్వరావు, వీణం శ్రీనివాస్,బొడ్డు దీక్షానందుడు,వెలికట్ల ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** తాడేపల్లి మలయాళ స్వామి పెద్దశ్రమంలో సూరపనేని రామలింగయ్య – వెంకట రావమ్మ జ్ఞాపకార్థం వారి మనవడు ఎన్నారై సూరపనేని శ్రీనివాస్ –నాగప్రియ దంపతుల ఆర్థిక సహకారంతో గురువారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల వైద్యులు డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ అశ్విన్,డాక్టర్ టోని, డాక్టర్ ఓవియా ఆధ్వర్యంలో గ్రామాల నుంచి వచ్చిన రోగులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. మొదట ఈ నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పేడు వేసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామీజీ, అసంగానంద గిరి స్వామీజీ, తెదేపా నాయకుడు పరుచూరి సుభాష్ చంద్రబోస్ ప్రారంభించారు. స్వామిజీలు మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరం ఈనెల 26 వరకు జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ఐ ఓ ఎల్ నేత్ర శస్త్ర చికిత్సలు జరుగుతాయన్నారు. సురపనేని వెంకట్రావు దంపతులను పరిపూర్ణానందగిరి స్వామీజీ సత్కరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, పెద్దశ్రమం కమిటీ సభ్యులు కోదండ రామయ్య, మొవ్వ శ్రీరామమూర్తి, తెదేపా నాయకులు గొర్రెపాటి సురేష్, సూరపనేని వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా దసరా నవరాత్రులు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ సెప్టెంబరు 18 :** మండలంలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా నవరాత్రుల వేడుకల్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ఆ దేవస్థాన చైర్మన్ ఈడె వెంకట విష్ణు మోహనరావు(మోహన్) అన్నారు. గురువారం దేవస్థాన మీటింట్ హాల్‌లో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశమునకు ధర్మకర్తల మండలి సభ్యులు తూము రాజ్యలక్ష్మీ, గుడ్లవల్లేటి వాణి, ముంగం ఆంజనేయులు, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్రబాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, నూతలపాటి లక్ష్మీ పావని, ఎక్స్- అఫీషియో మెంబర్ రుద్రపాక శర్చంద్ర శివ సంతోష్ శర్మ హాజరయ్యారు. సమావేశంలో ఈ నెల 22వ తేదీ నుండి జరిగే దసరా మహోత్సవాల జరపవలసిన ఏర్పాట్లు గురించి ఈఓ ఆకుల కొండలరావు మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రముఖులను ఆహ్వానించుట గురించి చర్చించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యములు కలుగకుండా ఏర్పాట్లు చేయుట గురించి చర్చించుట జరిగినది.

# విద్యుత్ షాక్‌కు గురై 4 ఏళ్ల బాలుడు మృతి







**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై నాలుగు సంవత్సరాల బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దాడంగి శివారు తాడంకి శివారు పండరీపురంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి సేకరించిన వివరాల ప్రకారం పండరీపురం గ్రామంలో యడ్లపల్లి నాగరాజు కుమారుడు తిరుపతిరావు (4) ఇంటి పక్కనే ఉన్న రైస్ మిల్లు వద్ద ఆడుకుంటూ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్దకు వెళ్ళగా అక్కడ వేలాడుతున్న వైర్లు తగిలి విద్యుత్ షాక్ కు గురయ్యాడు. దీంతో సంఘటనా స్థలంలోనే బాలుడు మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత తల్లిదండ్రులు బాలుడు కోసం వెతకగా ట్రాన్స్ ఫార్మర్ వద్ద విగతజీవిగా పడి ఉంటాన్ని గమనించారు. దీంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగారు. ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఫీజు క్యారియర్లకు సేఫ్ట్ లేకపోవడం వల్లే తమ కుమారుడు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడని తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే ఎస్సై బి.శ్రీను సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాలుని తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్. ఐ దర్యాప్తు చేస్తున్నారు. రైస్ మిల్ యజమానికి పలుమార్లు ఎస్సై ఫోన్ చేసినా స్పందించకపోవడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ కు తరలివచ్చి తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న రైస్ మిల్లు యజమాని ఎట్టకేలకు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని స్థానిక సీఐ వి.చిట్టిబాబు, ఎస్ఐ శ్రీనులతో మాట్లాడారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ విద్యుత్ శాఖ, రైస్ మిల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే రైస్ మిల్లు స్థలంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఉన్న కారణంగా తమ శాఖకు ఈ విషయంలో ఎటువంటి సంబంధం ఉండదని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

# మత్తు పదార్థాల వినియోగం దుష్పరిణామాలపై అవగాహన సదస్సు



**గన్నవరం, సెప్టెంబర్ 18, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం, కేసరపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలు పై అవగాహన సదస్సు స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ..మత్తు పదార్థాలు మొదట్లో సరదాగా అనిపించినా, క్రమేపీ అలవాటై జీవితాన్ని పాడుచేస్తాయి. ఆల్కహాల్, పొగాకు, గంజాయి వంటి పదార్థాలు శారీరక, మానసిక రుగ్మతలకు దారితీస్తాయి. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్త వహించాలి. చెడు అలవాట్లు ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతాయి కాబట్టి మొదటినుంచే నిరాకరించాలి అని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. తరువాత నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్ కె నజ్మా మాట్లాడుతూ – విద్యార్థి దశలో మద్యం, ధూమపానం, గంజాయి, గుట్కా వంటి పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రత కోల్పోయి మానసిక కుంగుబాటు ఏర్పడుతుంది. అది నేరప్రవృత్తులకు కూడా దారితీస్తుంది అని హెచ్చరించారు. అలాగే జోనల్ కోఆర్డినేటర్ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ – మాదక ద్రవ్యాలకు బానిసైన విద్యార్థులు, యువతను డీ–అడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చు. ఇందుకోసం నూజివీడులోని పొలసానపల్లి గ్రామంలో "బోస్కో డీ–అడిక్షన్ సెంటర్"ను నవజీవన్ బాల భవన్ ఏర్పాటు చేసింది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు ఉచితంగా సంప్రదించవచ్చు. సంప్రదించవలసిన నంబర్: 9490492020 అని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. నరేష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పాఠశాల తరపున విజ్ఞప్తి చేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నవజీవన్ బాల భవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పండుగలా స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. ప్రతిరోజు దివిసీమ లోని పలు గ్రామాల నుంచి మండలి అభిమానులు తరలివచ్చి వంతెన సెంటరులోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. గురువారం ఉదయం మండల పరిధిలోని తుంగలవారిపాలెం గ్రామానికి చెందిన కూటమి నాయకులు, సామాన్య ప్రజలు, మహిళలు వందలాదిగా తరలివచ్చి తమ అభిమాన నాయకులు ఎంవీ కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు, పెద్దసంఖ్యలో తరలివచ్చిన మండలి అభిమానులు పాల్గొన్నారు.



## ఎంపీ బాలశౌరి పుట్టినరోజు సందర్భంగా అనాథలకు

# ఆహార పొట్లాలు పంపిణీ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పుట్టినరోజు సందర్భంగా అవనిగడ్డ లోని అనాథలకు యాచకులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. గురువారం స్థానిక వంతెన సెంటర్లో తెలుగు యువత అధ్యక్షులు కూరాకుల శివప్రసాద్ ఆధ్వర్యంలో యాచకులు, రిక్షా కార్మికులకు ఆహార పొట్లాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ యలవర్తి చిన్నా, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్, యలవర్తి ఆది, భోగిరెడ్డి బుజ్జిబాబు, మాదివాడ రాము, మైలా హరిబాబు, మండలి శివప్రసాద్, చిట్టా ప్రసాద్, దామెర్ల సతీష్, చందన నరసింహారావు, కొట్టే విజయ్, బచ్చు శ్రీను, మండలి సురేష్, కూరాకుల శివయ్య, నరహరిశెట్టి నాగేశ్వరరావు, టీమ్ ఆది సభ్యులు పాల్గొన్నారు.

# వాహనమిత్ర పెంచి డ్రైవర్లందరికి వర్తింప కార్మిక సంఘాల భారీ ప్రదర్శన



**విజయవాడ, మేజర్ న్యూస్ :** డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ట్రాన్సపోర్టు డ్రైవర్లు అందరికి వాహనమిత్రను వర్తింప చేస్తూ 30 వేలకు పెంచి అందించాలని, జీవో 21 రద్దు చేస్తూ ఆటో మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు వంటి ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ రోజు విజయవాడ రైల్వే స్టేషన్ నుండి ఆటోరాష్ట్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మహాప్రదర్శన చేశారు. పెద్ద ఎత్తున ఆటో కార్మికులు పాల్గొన్న ఈ ర్యాలీ ఏలూరు లాకుల మీదుగా గాంధీనగర్ ధర్నా చౌక్ వరకు జరిగింది. అనంతరం జరిగిన సభను ఉద్దేశించి సిఐటీయు రాష్ట్ర అధ్యక్షులు ఏ.వి. నాగేశ్వంరావు మాట్లాడుతూ డ్రైవర్లందరికీ వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని, 300 యూనిట్లు, ఐటి రిటర్న్స్, చలానాలు వంటి నిబంధనలతో అనర్హులుగా ప్రకటించడం అన్యాయం మన్నారు., డ్రైవింగ్ లైసెన్సే అర్హతగా ఉన్నవారందరికీ వాహనమిత్ర ఇవ్వాలి. అలాగే కర్ణాటక, కేరళ, తమిళనాడు తరహా సంక్షేమ బోర్డును వెంటనే ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలి. లేదంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు కె. పోలారి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆటో మోటారు కార్మికులకు టీడీపీ, జనసేన కూటమి అనేక హామీలు ఇచ్చి ఎన్నికల మ్యానిఫ్యాస్టోలో కూడా పొందుపర్చి ప్రకటించి ఇప్పుడు అమలు చేయక పోవడం దుర్మార్గమన్నారు. ఉపాధి కల్పన పేరుతో కంపెనీలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్న చంద్రబాబు స్వంతంగా ఉపాధి పొందుతున్న 6 లక్షల ఆటో కార్మికులలో కేవలం 2.75 లక్షల మందికి మాత్రమే వాహనమిత్ర అమలు చేయడం కార్మిక వర్గాన్ని మోసం చేయడమే అన్నారు. కానీ 15 నెలల తరువాత ఆటో కార్మికుల ఉపాధిని సప్తపర్చే ఫ్రీ. బస్సు పథకం ప్రవేశ పెట్టిన సందర్భంలో అయినా మాకిచ్చిన హామీల గూర్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటన చేయలేదు. మా కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామన్నారు. కానీ ఆ కమిటీ కూడా ఆటోమోటారు కార్మిక సంఘాలతో ఎలాంటి చర్చలు జరుపలేదన్నారు. కావున స్త్రీశక్తి ఫ్రీ బస్సు కారణంగా ఉపాధి దెబ్బ తింటున్న డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ఆటో, క్యాబ్ డ్రైవర్లు అందరికి వాహన మిత్ర పథకం వర్తింప చేయాలి. సహాయాన్ని 30 వేల రూపాయిలకు పెంచి అందించాలి. ఆదే విధంగా ఎన్నికల హామీలు అయిన పెనాల్టీల భారాలు తగ్గిస్తూ జీవో 21ని సవరించాలి. ముఖ్యంగా ఆటో మోటారు కార్మికులకు సాధికారిత సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. అనంతరం రాష్ట్ర ట్రాన్స్పోర్టు కమీషనర్‌కి ఆటో కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు మెమోరాండం ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపి ఆటో & ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహమ్మద్, అధ్యక్షులు ఎన్ శివాజీ, ఐఎఫ్ఎయు ఆటో మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు కె.దుర్గారావు, ఇఫ్టూ నాయకులు ఎం.శంకర్, ఐఎఫ్ టియు రాష్ట్ర నాయకులు ఎం. రామకృష్ణ, ఆర్.రవీంద్ర, ఆర్.వెంకటేష్, ఎఐసిసిటియు రాష్ట్ర నాయకులు ఉదయ్ కిరణ్, ఈశ్వరరావు, వైఎస్సార్‌టీయూ నాయకులు కిరణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** వరి పంటకు తీవ్రనష్టం కలిగించే ఎలుకలను నిర్వహించేందుకు సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు జె ఎస్ జయప్రద తెలిపారు. గురువారం ఎంపీపీ తుంగల సుమతీదేవి అధ్యక్షతన సబ్ డివిజన్ పరిధిలోని అవనిగడ్డ, మోపిదేవి, నాగాయలంక, కోడూరు మండలాల్లో సామూహిక ఎలుక నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి జయప్రద మాట్లాడుతూ 23 వేల హెక్టార్ల విస్తీర్ణానికి 230 కిలోల బ్రోమో డయోలిన్ అన్ని రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఒక హెక్టారు విస్తీర్ణానికి 10 గ్రాముల బ్రోమో డయోలిన్ మందు,10 గ్రాముల నూనె, 450 గ్రాముల నూకలు కలిపిన మిశ్రమాన్ని 10 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి ఎలుకల కన్నాల దగ్గర పెట్టుకోవాలని రైతులకు సూచించారు. ఎలుకల మందులు అందని రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ సహాయకులను సంప్రదించి తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు విఏఏలు, రైతులు పాల్గొన్నారు.

## వి.ఆర్. ఏ.లకు పేస్కేల్ అమలు చేయాలి

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల మండలంలో 30 మంది ఘంటసాల గ్రామ సహాయకులకు పనిచేస్తూ కేవలం రూ.11,000/- తోనే పనిచేయడం జరుగుతుందని, మాకు కూడా పే స్కేల్ అమలు చేయాలని, మండల తహసీల్దార్ కార్యాలయంలో నిరసన తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు 18 న తహసిల్దార్ విజయ ప్రసాద్కు వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షులు మహేష్ తదితర వీఆర్ఏలు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం నిత్య అవసర సరుకులు రేట్లు పెరగడం వలన మాపై అధిక భారం పడుట వలన గోత 6 సం" ఎటువంటి జీత భత్యం పెరగనందున మా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందనీ ఆవేదన వ్యక్తం చేశారు. మా కుటుంబాలు వీదిన పడవలసి వస్తుంది. డిమాండ్లు తక్షణమే ప్రభుత్వ దృష్టికి తీరు మని వెళ్ళి మా సమస్యలను పరిష్కరణ దిశగా కోరడమైనదన్నారు.



## నాగేశ్వరరావు పెద్దకర్మలో మాజీ ఎమ్మెల్యే కైలే

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మంటాడ రెడ్డిపాలెం గ్రామంలో గురువారం జరిగిన బొల్లెద్దు నాగేశ్వరరావు పెద్దకర్మ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాస్, కొడాలి రాంబాబు, కొడమంచిలి మహేష్, శొంఠి వెంకటేశ్వరరావు, ఉమ్మడిశెట్టి శ్రీలక్ష్మి తదితర నాయకులతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవెన్యూ కార్యాలయం వద్ద విఆర్ఏ లు ధర్నా

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లను చేర్చాలని వీఆర్ఏలు ధర్నా నిర్వహించారు. గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట తమ డిమాండ్లను తెలియజేసే ప్లే కార్డులను చేత బూని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వో అటెండర్ వాచ్మెన్ డ్రైవర్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలో మొత్తం 15 మంది వీఆర్ఏలు ఉన్నారని నామిని వీఆర్ఏలను క్రమబద్దీకరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి వెంకటేశ్వరరావు, మునీశ్వరరావు, సంపూర్ణ రావు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్లంక దీవి కోత సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టండి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కృష్ణానది వరదల కారణంగా కోతకు గురౌతున్న పాత ఎడ్లంక దీవి కోత నివారణకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సీనియర్ తెలుగుదేశం పార్టీ నేత బొబ్బా గోవర్ధన్ నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు తహసీల్దార్ కు విజ్ఞప్తి చేశారు. గురువారం అవనిగడ్డ తహసీల్దార్ ను కలసిన బొబ్బా గోవర్ధన్ మాట్లాడుతూ నది కోత కారణంగా ఎడ్లంక గ్రామ ప్రజల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని, వారి వసతి ఉపాధి మొత్తం దీవి మనుగడపై ఆధారపడి ఉందని, వారికి కేవలం ఇళ్ల స్థలాలు మాత్రమే ఇవ్వడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, గ్రామంతో వారి ఉపాధి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు.. గ్రామం కోతకు గురికాకుండా తగిన చర్యలు తీసుకొని ప్రజలకు భరోసా కల్పిస్తే గ్రామస్తులు ఎవరూ గ్రామం వదలి పోరని దీనిని దృష్టిలో ఉంచుకొని ఇటీవల గ్రామంలో పర్యటించిన కేంద్ర జల సంఘం, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ అధికారులు చేసిన మేరకు గ్రామం మీదకు వరద ఉద్ధృతి పెరిగేందుకు కారణమైన పెద్ద ఇసుక మేటలను సరిచేయించాలని, దానితో పాటు కోత నివారణకు రాళ్ల మొండిలు నిర్మించాలని సూచించారు.. గ్రామంలో కోత నివారణ, ఇళ్ల స్థలాలు కేటాయింపు తదితరాలపై వెంటనే గ్రామ సభ ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు సూచించగా శనివారం గ్రామ సభ నిర్వహించేందుకు తహసీల్దార్ ఆమోదం తెలిపారు.. శనివారం గ్రామ సభ నిర్వహించేందుకు గాను వెంటనే గ్రామంలో టముకు వేయించాలని తహసీల్దార్ సూచించారు.. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పీతా వెంకటేశ్వరావు, కొల్లూరి వాసు, పాలెపు దుర్గారావు తెలుగుదేశం నేతలు బండే శ్రీనివాసరావు, కర్రా సుధాకర్, పర్చూరి దుర్గాప్రసాద్, దిరిశం బాలకోటయ్య, మేడికొండ విజయ్, బచ్చు హనుమాన్,అడపా శ్రీను, అడపా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఈవీఎం గోదాము తనిఖీ చేసిన కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గోదామును జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ స్టేట్ ఈవీఎం నోడల్ అధికారి ఎస్ ఆంజనేయులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఈవీఎంలు భద్రపరచిన గోదాము, వాటి సీళ్లు, సెక్యూరిటీ, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి రిజిస్టర్ లో సంతకం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు, బిజెపి, సిపిఎం, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు పి గజేంద్ర రావు, కొడాలి శర్మ, ఎస్ బాలాజీ, ఈవీఎంల నోడల్ అధికారి నిత్యానంద్, ఎన్నికల విభాగం అధికారులు శ్యామ్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఘనంగా ఎంపీ బాలశౌరి పుట్టినరోజు వేడుకలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ మచిలీపట్నం ఎంపీ బాలశౌరి జన్మదిన వేడుకలను అవనిగడ్డ జన సైనికులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం స్థానిక వంతెన సెంటర్లో అవనిగడ్డ జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు యువ నాయకులు మండల వెంకట్రామ్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు భారీ కేకు ను కట్ చేసి బాలసౌరి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టీడీపీ మండణిల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, సీనియర్ నాయకులు మత్తి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షులు యలవర్తి చిన్నా, మాదివాడ రత్నారావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, ఎంపీటీసీ బొప్పన భాను, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, కూటమి నాయకులు ఘంటసాల కన్నయ్య, భోగిరెడ్డి బుజ్జిబాబు, యలవర్తి ఆది, గుడివాక రామాంజనేయులు, దేగల రాఘవ, తుంగల లక్ష్మి, మత్తి శివపార్వతి, కూరాకుల శివప్రసాద్, ముళ్లపూడి శ్రీనివాసరావు, చెన్ను రాంబాబు, చెన్ను బాబూరావు, గుగ్గిలం శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దివిసీమలో ఎంపీ బాలసౌరి జన్మదిన వేడుకలు



**నాగాయలంక సెప్టెంబర్ 18 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలోని మెయిన్ సెంటర్లో మూడు రోడ్ల సర్కిల్ వద్ద, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు, వల్లభనేని బాలసౌరి, పుట్టినరోజు వేడుకలు నాగాయలంక డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు(చిన్నబాబు) ఆధ్వర్యంలో టీ.కొత్తపాలెం, మాజీ సర్పంచ్ మెండులక్ష్మణరావు, బండ్రెడ్డి హరి, రేమాల బాబురావు, మాదివాడ అర్జునరావు, బోగాది శివ విష్ణువర్ధన్, రేమాల మురళి, దివిమార్కెటింగ్ యాడ్, కమిటీ,సభ్యులు, ఉప్పల ప్రసాద్, తాడేపల్లి వెంకటపాపారావు, మర్రిపాలెం మాజీ సర్పంచ్, బండ్రెడ్డి బోసు, బర్రెంకుల గ్రామ పి.ఎ.సిఎస్ చైర్మన్ శ్రీనివాసరావు, బండ్రెడ్డి మల్లికార్జున్, మండలి ఉదయ భాస్కర్, అంబటి శ్యాంప్రసాద్, ముమ్మారెడ్డి సురేష్, తలశిల హరిబాబు, తలశిల రాఘవరావు, అందె లెనిన్, నాగాయలంక బిజెపి మండల పార్టీ ప్రెసిడెంట్, గుడివాక శివాజీ, సీనియర్ బిజెపి నాయకులు చెన్నగిరి లతా మోహన్ తెలుగుదేశం పార్టీ,నాయకులు, తలశిల రామకృష్ణ (చౌదరి మాస్టర్) తలశిల బాలసుబ్రమణ్యం( బాలు), ఈ,ఊరి నాగార్జున,కూటమి నాయకులు పాల్గొని బాణసంచా వెలుగులలో బర్తడే కేకును కటింగ్ చేసి,కార్యక్రమానికి విచ్చేసినటువంటి బాలశౌరి అభిమానులకు కూటమి సభ్యులకు,బర్తడే కేకును, మిఠాయిలను, పంచి, సందడి వాతావరణం లో కార్యక్రమం నిర్వహించారు.

# అసెంబ్లీలో ప్రతిపక్షంలా మాట్లాడిన బోండా ఉమాకి ఆటో కార్మికుల ధన్యవాదాలు



**విజయవాడ, మేజర్ న్యూస్:** ప్రతిపక్ష నాయకునిలా అసెంబ్లీలో ఆటో కార్మికుల సమస్యలను ప్రస్తావించిన అధికార పక్ష శాసన సభ్యులు బోండా ఉమాకి రాష్ట్ర ఆటో కార్మికుల పక్షాన ఏపీ ప్రగతిశీల ఆటో మోటారు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. పోలారి, దాది శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేసారు. గతంలో కూడా ఉమా ఇదే విధంగా ఫిట్ నెస్ పెనాల్టీని తగ్గించడంలో కూడా ఎంతో కృషి చేసారన్నారు. ఆటోలకు రోడ్ టాక్స్ రద్దు చేయడంలో, జీవో నెంబర్ 8 ని నిలుపుదల చేయడంలో, విజయవాడలో గ్యాస్ బ్యాంకుల ఏర్పాటులో కూడా బోండా కృషి మరువలేనిది అన్నారు. దసరా కానుకగా చంద్రబాబు ఇచ్చిన వాహన మిత్ అరకొర మిత్రగా ఉన్నదని, ఫ్రీ బస్సు కారణంగా వాహన మిత్రను 30 వేలకు పెంచి సొంత వాహనంతో నిమిత్తం లేకుండా ఆటో డ్రైవర్లు అందరికి అందించాలని ఎన్నికల హామీలు అమలు చేయాలని రాష్ట్రంలో ఆటో కార్మికులు ఆందోళన చేస్తున్న తరుణంలో బోండా ఉమా ఆటో కార్మికుల గొంతుకై అసెంబ్లీలో మాట్లాడటం అభినందనీయం అన్నారు. ఆదాయం కోల్పోయి అరకొర సంపాధనతో ఇబ్బందులు పడుతున్న ఆటో మోటారు కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా తలకు మించి భారాలుగా పెనాల్టీలు వేస్తున్న జీవో నెంబర్ 21 రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఉమా అసెంబ్లీలో మాట్లాడిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా అలోచించి జీవో 21 రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా వాహనమిత్ర సహాయాన్ని 30 వేలకు పెంచి డ్రైవర్లు అందరికి వర్తింప చేయాలని కోరారు.

# దివీస్ ల్యాబొరేటరీస్ వాక్ - ఇన్ ఇంటర్వ్యూలకు అపూర్వ స్పందన





**జగ్గయ్యపేట సెప్టెంబర్ 18 మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ స్థాయి ఖ్యాతిగాంచిన దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్‌లో ఉపాధి అవకాశాల కోసం గురువారం పట్టణంలోని జేఆర్సి -విశ్వభారతి డిగ్రీ కాలేజీ లో నిర్వహించిన వాక్-ఇన్ ఇంటర్వ్యూలకు యువత నుంచి అపూర్వ స్పందన లభించింది. రెండు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి దాదాపు 60మంది కెమిస్ట్రీ గ్రాడ్యుయేట్లు ఇంటర్వ్యూలకు హాజరై, తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జెఆర్సీ కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు ప్రారంభించారు. కార్యక్రమంలో జెఆర్సీ సెక్రటరీ & కరెస్పాండెంట్ పెనుగొండ వెంకట రాజీవ్, కళాశాల ప్రిన్సిపాల్స్ కె.ఎన్. రమేష్, జూటూరు వెంకటేశ్వర్లు (అబ్బులు), ప్రతినిధులుగా జల్లా తిరుపతి రావు, వి.వి.ఎల్. నారాయణరావు పాల్గొన్నారు.డివీస్ ల్యాబొరేటరీస్ తరపున హెచ్ఆర్ ప్రతినిధులు రామకృష్ణ, శ్రీహరి విద్యార్థులతో ముచ్చటించారు. ఎంపికైన అభ్యర్థులకు 15 రోజుల్లో నియామక పత్రాలను ఈమెయిల్ ద్వారా పంపిస్తామని కంపెనీ అధికారులు హామీ ఇచ్చారు. ఈ వాక్-ఇన్ ఇంటర్వ్యూలు స్థానికంగా ఉద్యోగావకాశాలే కాకుండా, రాష్ట్రంలోని ప్రతిభావంతులైన యువతకు దేశస్థాయి, అంతర్జాతీయ స్థాయి కెరీర్‌కి దారి తీసే వేదికగా నిలిచాయని నిర్వాహకులు పేర్కొన్నారు. జెఆర్సి -విశ్వభారతి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఇలాంటివే మరిన్ని అవకాశాలు రాబోయే రోజుల్లో అందిస్తామని కళాశాల ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# జై భీమ్ రావు భారత్ పార్టీ మహా ధర్నా



**విజయవాడ మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను నిరసిస్తూ జై భీమ్ రావు భారత్ పార్టీ వ్యవస్థాపకులు,మాజీ న్యాయమూర్తి, ప్రముఖ హైకోర్టు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ ధర్నాచౌక్‌లో మహాధర్నా కార్యక్రమం చేపట్టారు. మహా ధర్నాకు వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ దళిత సంఘాలు, వామపక్షాలు సంఘీభావం తెలిపాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున మాజీ మంత్రి విడుదల రజిని, వామపక్ష పార్టీల తరుపున రామకృష్ణ,శ్రీనివాసరావు,మాజీ ఎస్సీ కమీషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్,దళిత సంఘ నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఫొటోకు పూలమాలలు వేసి నేతలు ఘన నివాళులు అర్పించారు. అనంతరం జడ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు కరణ చేయడాన్నీ తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పదో తరగతి చదివిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి డాక్టర్ విలువ ఏమి తెలుస్తుందనీ జడ ఎద్దేవా చేశారు..ప్రభుత్వ కాలేజీలు ప్రైవేటుపరం చేయడం రాష్ట్ర చరిత్రలో లేదనీ అన్నారు జడ. ప్రజలకు వైద్యం, విద్య దూరం చేయాలనే.. ఆలోచన ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీ కరణ ఉద్దేశమని అన్నారు. మంచి వాడికి మంచి ఆలోచనలు వస్తాయి దొంగలకు దొంగ ఆలోచనలు వస్తాయనీ దుయ్యబట్టారు జడ శ్రవణ్. 17 మెడికల్ కాలేజీలు తెచ్చి 5 కాలేజీలు ప్రారంభించారు జగన్ మోహన్ రెడ్డి.. పేదలకు వైద్య విద్య అందని ద్రాక్ష చేయాలనేదే ఈ కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ ఉద్దేశం అన్నారు... హోం మంత్రి అనితకు రాజకీయ అహంకారం పట్టగానే దళితులు గుర్తు రావడంలేదన్నారు..



రాబోయే ఎన్ని కల్లో దళితులు మిమ్మల్ని తరిమి తరిమి కొడతారనీ అన్నారు. దళిత బిడ్డలకు అన్యాయం చేస్తే మేము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కితీసుకోకుంటే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమం చేస్థామని కూటమి ప్రభుత్వాన్ని జడ శ్రవణ్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ రావు భారత్ పార్టీ నేతలు పరస సురేష్,కొండలరావు, జగ్గవరపు మల్లిఖార్జున,దళిత మహిళా సంఘ నేత మంచాల మల్లేశ్వరి,జై భీమ్ రావు భారత్ పార్టీ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు మండలాలను విజయవాడలో కలపండి



**గన్నవరం, సెప్టెంబర్ 18, మేజర్ న్యూస్ :** తాగునీరు, చెత్త సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గన్నవరం, విజయవాడ రూరల్ మండలాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వానికి కోరారు. గురువారం ప్రారంభమైన రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో యార్లగడ్డ పలు సమస్యలను ప్రస్తావించారు. ప్రకాశం బ్యారేజీకి కూతవేటు దూరంలో ఉన్న గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలంలో ఉన్న తొమ్మిది గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ తొమ్మిది గ్రామాల్లోని నీటిలో టీడీఎస్ (టోటల్ డిజాలవ్డ్ సాలిడ్స్ ) 2 వేల నుండి 3 వేల వరకు ఉందని ఈ నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించడం సురక్షితం కాదన్నారు. ఈ గ్రామాలకు తాగునీటి అందించేందుకు విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో రూ.2500 కోట్లతో చేపట్టిన పథకం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా కరెన్సీ నగర్ వరకు ఉన్న తాగునీటి పైపులైను ను ముందుకు పొడిగిస్తే ఈ గ్రామాల ప్రజలకు తక్కువ ఖర్చుతో కృష్ణానది నీటిని అందించవచ్చని యార్లగడ్డ సూచించారు. విజయవాడ నగర ప్రజలతో సమానంగ పన్నులు చెల్లిస్తూ సరైన వసతులు లేక ఈ తొమ్మిది గ్రామాల్లోని ప్రజలు ద్వితీయ శ్రేణి పౌరులుగా జీవించాల్సి వస్తుందని ఎమ్మెల్యే వెంకట్రావ్ ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా చెత్త సమస్య రోజురోజుకీ తీవ్ర రూపం దాలుస్తుందని దీని పరిష్కారం కోసం గన్నవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ మండలంలోని తొమ్మిది గ్రామాలను, గన్నవరం మండలాన్ని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలని శాసనసభ ద్వారా సంబంధిత మంత్రికి యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు. ఏళ్ళ తరబడి ఒకే చోట పనిచేస్తున్న పిఏసిఎస్ కార్యదర్శులను బదిలీ చేయాలని గత అసెంబ్లీ సమావేశాల్లో కోరితే ఇంతవరకు స్పందించలేదని వీరిని బదిలీ చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందా లేదా అని సూటిగా ప్రశ్నించారు. విజయ డయిరీ బాపులపాడు మండలంలో నిర్మించిన కామధేను ప్లాంట్లో జరిగిన అక్రమాలకు సంబంధించిన ఆధారాలను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేసి విచారణ కోరితే నవిచారణ జరిపిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటారా లేదా అని యార్లగడ్డ నిలదీశారు.

## ఎంపీను మర్యాదపూర్వకంగా కలిసిన క్రిబ్కో చైర్మన్



**విజయవాడ మేజర్ న్యూస్ :** క్రిబ్కో (క్రిషక్ భారతి కోఆపరేటివ్ లిమిటెడ్) నూతన ఛైర్మన్‌గా ఎంపికైన తెలుగు వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరి గురువారం గురునానక్ కాలనీలో విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో ఎంపి కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వల్లభనేని సుధాకర్ చౌదరికి ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపి పుష్పం గుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. సహకార రంగంలో రెండవ అతి పెద్ద ఎరువుల కంపెనీ అయిన క్రిషక్ భారతి కో -ఆపరేటివ్ లిమిటెడ్ చైర్మన్‌గా ఎరువులు, వ్యవసాయ రంగాలను బలోపేతం చేయడంలో కృషి చేయాలని సుధాకర్ చౌదరికి ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. ఈ కార్యక్రమం విజయ డైరీ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999